## అంబేద్కర్ నగర్ 16 వార్డ్‌లో గ్రామసభ



3లో

PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

## సత్తుపల్లి సైబర్ కేసులో కీలక మలుపు...



3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 96 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 03 ఏప్రిల్ 2026

# రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు

### - సభల్లో సిఎం రేవంత్ సందేశం విడుదల



**హైదరాబాద్,ఏప్రిల్ 02 (పిసీడబ్ల్యూ న్యూస్):** ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా రాష్ట్రమంతటా గ్రామ సభలు జరుగుతున్నాయి .ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సందేశం అందించారు. గ్రామ సభల్లో అధికారులు ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపిస్తారు. ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాల మూడునెలలు పూర్తయ్యింది. ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ, గత పాలకుల తప్పిదాలను సరిచేస్తూ... సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీపడకుండా మన ప్రభుత్వం పని చేస్తోంది. మేం పాలకులం కాదు... సేవకులం అన్న భావనతో ప్రజల ఆకాంక్షలు, అవసరాలే కేంద్ర బిందువుగా నిత్యం శ్రమిస్తున్నాం. ప్రతి నిర్ణయంలో ప్రజల మేలు, సామాజిక బాధ్యత, రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుంటున్నాం.ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలతో ప్రజా పాలనకు మీ ఆమోదం, మద్దతు ప్రకటించారు. మీరు ఇచ్చిన ఈ ఫలితాలు మా బాధ్యతను మరింత పెంచాయి. ప్రభుత్వ పథకాలు అంటే కాగితాలపై కాదు... ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తేవాలన్నది మా సంకల్పం. ఆ ఉద్దేశంతోనే 'ప్రజాపాలన- ప్రగతిప్రణాళిక' పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించాం. మార్చి 6 నుండి 99 రోజుల పాటు, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు, అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం ఒక ఉద్యమంలా సాగాలి. ఊరు వాడ సమస్యల పరిష్కారమే పరమావధిగా ప్రతి అధికారి పని చేయాలి. వేగంగా ఫైళ్ల క్లియరెన్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలి. మహాలక్ష్మి... ఉచిత బస్సుసౌకర్యం, 500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, మహిళా సాధికారత వంటి పథకాలు మిగతా2లో...

# కాళేశ్వరం పేరుతో ప్రజాధనం లూటీ

- కెసిఆర్ ఇష్టానుసారం కాళేశ్వరం నిర్మాణం
- ఎటిఎంలా ప్రాజెక్ట్ను వాడుకున్న కెసిఆర్
- ఐదు మండలాలపై ఆనాడు నోరు మెదపని కెసిఆర్
- అవినీతిపై కెసిఆర్‌ను జైలుకు పంపుతామన్న కాంగ్రెస్
- రాజ్యసభలో సురేశ్ రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డ కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 02 (పిసీడబ్ల్యూ న్యూస్):** రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాలేశ్వరం ప్రాజెక్ట్ కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందన్నారు. కాలేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగాయన్నారు. కాలేశ్వరం వల్ల ఉగయోగం లేదని నివేదికలు చెప్పాయని తెలిపారు. కాళేశ్వరం ప్రజల డబ్బుతో కట్టారా? లేక కేసీఆర్ సొంత డబ్బుతో మిగతా2లో...




## యుద్ధాన్ని ఆపేది లేదు.. అమెరికాకు అవమానం తప్పదు.. తేల్చిచెప్పిన ఇరాన్

**అమెరికా,ఏప్రిల్ 02 (పిసీడబ్ల్యూ న్యూస్):** అమెరికా, ఇజ్రాయెల్‌లకు ఇరాన్ భారీ హెచ్చరిక జారీ చేసింది. ఎట్టి పరిస్థితుల్లో యుద్ధాన్ని ఆపేది లేదని స్పష్టం చేసింది. అమెరికా బెదిరింపులకు లొంగబోమని తెలిపింది. యుద్ధం ముగింపుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రకరకాల ప్రకటనలు చేస్తున్న వేళ ఇరాన్ చేసిన ప్రకటన సంచలనం సృష్టిస్తోంది. ఈ మేరకు ఇండియాలోని ఇరాన్ ఎంబసీ తన సోషల్

మిగతా2లో...

# కాంగ్రెస్ మోసాలను సోషల్ మీడియాతో ఎండగట్టాలి

### - పార్టీ శ్రేణులకు హరీష్ రావు పిలుపు




**సంగారెడ్డి,ఏప్రిల్ 02 (పిసీడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను సోషల్ మీడియా వేదికగా ఎండగట్టాలి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గం బొల్లారంకు చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎండీ ఆరిఫ్ తో పాటు మరో 25 మంది సభ్యులు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాలరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరార. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..ప్రస్తుత రాజకీయాల్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలంటే సోషల్ మీడియాలో అత్యంత చురుకుగా మిగతా2లో...

# అమరావతికి చట్టబద్ధతకు థాంక్స్

### - ప్రధాని మోడీని కలిసి లోకేశ్ కృతజ్ఞతలు



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 02 (పిసీడబ్ల్యూ న్యూస్):** అమరావతికి చట్టబద్ధత బిల్లుకు బుధవారం లోక్‌సభ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లుకు లోక్‌సభలో ఏకగ్రీవ ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. గురువారం బిల్లును రాజ్యసభలో ప్రవేశ పెట్టారు.

మిగతా2లో...

# చేనేత ఆర్డర్ల రద్దుతో కార్మికులపై కక్ష

- అయిన వారి కోసం..కార్మికుల పొట్ట కొడతారా?
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కవిత



**హైదరాబాద్,ఏప్రిల్ 02 (పిసీడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల పొట్టకొడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. చేనేత కార్మికులకు ఇచ్చిన విద్యార్థుల యూనిఫాంల ఆర్డర్‌ను ఏకపక్షంగా రద్దు చేయడంపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాల్సిన వారికి మేలు చేసేందుకే కార్మికులకు అన్యాయం చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఏటా సుమారు రూ.105 కోట్ల యూనిఫాంల ఆర్డర్ ఇచ్చేవారని.. ఇప్పుడు దాని రద్దుతో వేలాది మందికి ఉపాధి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతల ఉపాధి సంక్షోభంలో పడిందని కవిత ధ్వజమెత్తారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 393 చేనేత సహకార సంఘాలపై తీవ్ర ప్రభావం మిగతా2లో...

# భూభారతి పోర్టల్ ఆవిష్కరణ

### - అక్రమాలకు ఇక చెక్ : పొంగులేటి



**రంగారెడ్డి,ఏప్రిల్ 02 (పిసీడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసి చూపిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. భూ క్రయవిక్రయాల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రూపొందించిన 'సమీకృత భూభారతి' పోర్టల్‌ను రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం విఠాయిపల్లిలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే ప్రజా ప్రభుత్వమిది అని అన్నారు. ఈ నెలాఖరులో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జరుగుతుందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నిరంతరం కొనసాగుతుందని చెప్పారు.



## ఫ్యూచర్ సిటీలో పనులు పరిశీలించిన సిఎం రేవంత్

**హైదరాబాద్,ఏప్రిల్ 02 (పిసీడబ్ల్యూ న్యూస్):** కేరళలో ఎన్నికల ప్రచారం ముగించుకుని వచ్చిన సిఎం రేవంత్ రెడ్డి, ఫ్యూచర్ సిటీపై దృష్టి సారించారు. గరువారం అధికారులతో కలసి ఆయన ఫ్యూచర్ సిటీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఫ్యూచర్ సిటీలో ఎఫ్‌సిడిఎ కార్యాలయం, స్కిల్స్ యూనివర్సిటీ పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. పలు సూచనలు చేశారు. సిఎం వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. కె. రామకృష్ణారావు తదితరులు ఉన్నారు.

# కమిషన్ల కోసమే టెస్కోకు ఆర్డర్లు రద్దు

### - ఎక్స్ వేదికగా ప్రభుత్వ తీరుపై కెటిఆర్ విమర్శలు



**హైదరాబాద్,ఏప్రిల్ 02 (పిసీడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు సంస్థలకు వత్తాసు పలకడమేనా ప్రజా పాలనా..అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. టెస్కోకు విద్యాశాఖ షాక్ అని ఓ ప్రముఖ దినపత్రికలో వచ్చిన కథనాన్ని ఎక్స్‌లో కేటీఆర్ ట్యాగ్ చేస్తూ రేవంత్ సర్కార్ రాష్ట్ర ప్రభుత్వ సంస్థ టెస్కోకు ఆర్డర్లు రద్దు చేసి ప్రైవేట్ కంపెనీలకు ఇచ్చి చేనేత సంఘాల కార్మికుల పొట్ట కొడుతుందని.. ఇది ప్రజా ప్రభుత్వమా.. లేక 'ప్రైవేట్' లిమిటెడ్ కంపెనీయా..? అని మండిపడ్డారు. మిగతా2లో...

# అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఆమోదం

**● వైసీపీ వాకౌట్ ● చర్చలో 11 పార్టీలు..18 మంది సభ్యులు**

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 02 (పిసీడబ్ల్యూ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. దీంతో ఈ బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభల ఆమోదముద్ర ప్రక్రియ ముగిసింది. ఈ బిల్లును కేంద్రం రాష్ట్రపతికి పంప నుంది. ఈ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సం తకం చేసిన తరువాత గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుం ది. గురువారం రాజ్యసభలో కేంద్ర హోం శాఖ సహా య మంత్రి నిత్యానంద రారు బిల్లును ప్రవే శపెట్ట నున్నారు.రాజ్యసభ చైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ బిల్లుపై



చర్చకు అనుమతి ఇచ్చారు. అమ రావతి చట్టబద్ధత బిల్లుపై జరిగిన చర్చలో 11 పార్టీలు నుంచి 18 మంది సభ్యులు పాల్గొన్నారు. అయితే వైసీపీ రాజ్యసభలో కూడా బిల్లును వ్యతిరేకించి వాకౌట్ చేసింది.

# కాళేశ్వరం పేరుతో ప్రజాధనం లూటీ

(మొదటి పేజీ తరువాయి)

కట్టారా అంటూ ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి నిధులు తీసుకొని కాళేశ్వరం నిర్మించారని కేంద్ర మంత్రి తెలిపారు. భద్రాచలంలో ఉన్న గ్రామాలు ఏపీ పునర్విభజన చట్టంలో చేర్చారని... అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. ఎన్నికల ముందు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరిపి కేసీఆర్‌ను జైలుకు పంపిస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. మాజీ సీఎంపై ఎందుకు విచారణ జరపలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిలదీశారు. ఈ క్రమంలో కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను ఉసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ పనికిరాకుండా పోవడానికి బీఆర్ఎస్ కారణమని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ కూడా చెప్పిందన్నారు.కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుంది. ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. రూ.లక్షకోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారు. కేసీఆర్‌ను జైల్లో పెడతానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారు. విలీనం తర్వాత కూడా సోనియాగాంధీ ఇంటికి ఆయన వెళ్లారని కిషన్‌రెడ్డి అన్నారు.

# కాంగ్రెస్ మోసాలను సోషల్ మీడియాతో ఎండగట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉండాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడంలో సోషల్ మీడియానే నేడు కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా రాష్ట్ర యువతను తీవ్రంగా దగా చేసింది. ఎన్నికలకు ముందు అమలుకాని హామీలిచ్చి గద్దెనెక్కి, అధికారంలోకి వచ్చాక నిలువునా ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ లేదు, కొత్తగా ఉద్యోగాల కల్పన లేదు. వారు చెప్పిన రెండు లక్షల ఉద్యోగాల హామీ పూర్తిగా బోగస్ అని తేలిపోయింది. యువతతో పాటు రాష్ట్రంలోని అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచించిందని మండిపడ్డారు. అవ్వాతాతల కు పెన్షన్లు పెంచకుండా, కోటి మంది మహిళలకు నెలకు రూ. 2500 ఇవ్వకుండా, రైతన్నలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా ప్రతి వర్గాన్ని దారుణంగా మోసం చేసింది. ఈ ప్రభుత్వ తీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మీలాంటి యువత ముందుకొచ్చి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలి. కాంగ్రెస్ చేస్తున్న ప్రతి మోసాన్ని సోషల్ మీడియా వేదికగా సామాన్య ప్రజలందరికీ తెలిసేలా చేయాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు పార్టీ ఇన్‌ఛార్జి ఆదర్శ్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 24 నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

**అధికారికంగా ప్రభుత్వం ఉత్తర్వులు**

**హైదరాబాద్,ఏప్రిల్ 02 (పిసీడబ్ల్యూ న్యూస్):** ఈ నెలాఖరు నుంచి స్కూళ్లకు సెలవులు ప్రారంభం కానున్నాయి. నెలాఖరులోగా సిలబస్ పూర్తి చేసి, పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. ఎండలు దంచికొడుతున్న క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఊరటనిచ్చే వార్త చెప్పింది. వేసవి సెలవుల షెడ్యూల్‌ను అధికారికంగా ఖరారు చేసింది. వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని స్కూళ్లకు సెలవులను అధికారులు ముందుగానే ప్రకటించారు. విద్యాశాఖ తాజా ప్రకటన ప్రకారం.. తెలంగాణలోని స్కూళ్లకు ఈ ఏడాది ఏకంగా 48 రోజుల పాటు వేసవి సెలవులు ఉండనున్నాయి. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు ఈ సెలవులు అమల్లో ఉంటాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలకు ఈ నిబంధన వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం జూన్ 12న తిరిగి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. సెలవులు ప్రారంభమయ్యే లోపు సిలబస్ పూర్తి అయ్యేలా చూడాలని ప్రభుత్వం పాఠశాలల యాజమాన్యాలకు సూచించింది. అవసరమైతే విద్యాపరంగా ఎలాంటి



అంతరాయం లేకుండా వారానికి ఒకసారి అదనపు తరగతులు నిర్వహించవచ్చని తెలిపింది.

# సమస్యలు తెలుసుకోవడమే గ్రామసభల లక్ష్యం

**2047 విజన్‌తో రాష్ట్రాన్ని ముందుకెళుతున్న సిఎం**

**తుమ్మలూరు గ్రామసభలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**

**హైదరాబాద్,ఏప్రిల్ 02 (పిసీడబ్ల్యూ న్యూస్):** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామసభలు విజయవంతంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు రంగారెడ్డి జిల్లా మాహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ 2047 విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. మనమందరం ఈ ప్రగతి పాలనలో భాగస్వాములం కావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే




గ్రామసభ ముఖ్య ఉద్దేశం అని సి.ఎస్ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేయడం జరుగుతు ందని తెలిపారు. ప్రభుత్వ పథకాలతో పాటు, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అన్ని హాస్టళ్లు, స్కూళ్లలో డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచడం ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన ఆహారం, వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని ఆయన అన్నారు. మహిళా సాధి కారత కొరకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, స్కూల్ యూనిఫాం కుట్టే పనులు, ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే ఈ సభల ముఖ్య ఉద్దేశమని సి.ఎస్ అన్నారు. కళ్యాణ్ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

# యుద్ధాన్ని ఆపేది లేదు.. అమెరికాకు అవమానం తప్పదు.. తేల్చిచెప్పిన ఇరాన్

(మొదటి పేజీ తరువాయి)

మీడియా వేదికగా ఈ ప్రకటన చేసింది."మేం అమెరికా బాంబుల కారణంగా రాతియుగంలోకి వెళ్లడం లేదు. మాకు 7,000 ఏళ్ల నాగరిక చరిత్ర ఉంది. చరిత్రకు ఈ విషయం తెలుసు. అమాయకులైన పిల్లల్ని చంపి, అమానవీయ నేరాలు చేస్తున్న మీరు రాతియుగాన్ని ఆధునిక ప్రపంచంలోకి తెచ్చారు అనేది స్పష్టం" అని తన ట్వీట్‌లో పేర్కొంది. ఇరాన్‌తో యుద్ధంపై బుధవారం రాత్రి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. తాము ఇరాన్‌పై చేస్తున్న యుద్ధం కారణంగా ఆ దేశం రాతియుగంలోకి వెళ్తుందన్నారు. ఇరాన్ సైన్యం, నేవీ పూర్తిగా బలహీనపడిపోయాయని చెప్పారు. యుద్ధాన్ని రెండు, మూడు వారాల్లో ముగిస్తామన్నారు. అయితే, ఇరాన్ మిలిటరీ మాత్రం ట్రంప్ ప్రకటనకు ధీటుగా స్పందించింది. అమెరికాకు తీవ్ర అవమానం జరిగే వరకు యుద్ధాన్ని వదలేది లేదని, అమెరికా పశ్చాత్తాప పడి, లొంగిపోయే వరకు తమ దాడులు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఇరాన్ మిలిటరీకి నష్టం జరిగిందన్న అమెరికా ఆరోపణల్ని కూడా ఆ దేశం ఖండించింది. అమెరికా తమను తక్కువగా అంచనా వేసిందని అభిప్రాయపడింది. ఇరాన్ సైనిక ప్రతినిధి ఒకరు ఈ వ్యాఖ్యలు చేశారు. తమ దేశం దగ్గరున్న సైనిక శక్తి, మిస్సైళ్ల తయారీ గురించి అమెరికా ఇంటెలిజెన్స్‌కు సరిగ్గా తెలియదన్నారు. లాంగ్ రేంజ్ అటాక్ మిస్సైల్స్ డ్రోన్లు, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, స్పెషలైజ్డ్ ఎక్విప్‌మెంట్ వంటివి తమ దేశం దగ్గరున్నాయని ఇరాన్ ప్రతినిధి మీడియాతో తెలిపారు.

# అమరావతికి చట్టబద్ధతకు థాంక్స్

(మొదటి పేజీ తరువాయి)

హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో అమరావతికి చట్టబద్ధత బిల్లును లోక్‌సభ ఆమోదించిన నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ భారత ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఐదుకోట్ల మంది ప్రజల ఆకాంక్ష అయిన అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పూర్తి మెజార్టీతో లోక్‌సభలో ఆమోదం లభించడానికి కృషి చేసిన ప్రధాని మోదీకి లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం ఉదయం పార్లమెంట్ హాలులో మంత్రి లోకేశ్ ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. దేశంలో ఉన్న అన్ని పార్టీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు నిలిపి అమరావతికి చట్టబద్ధత కల్పించిన ప్రధాని మోదీకి ఆంధప్రదేశ్ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు.లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన వెంటనే మంత్రి నారా లోకేశ్ ఆగమేఘాలపై ఢిల్లీ వెళ్లారు. కూటమి పార్టీ ఎంపీలను అభినందించారు. ఉదయం ప్రధానమంత్రి మోదీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి చూపిన నిబద్ధతను మంత్రి లోకేశ్ ప్రశంసించారు.

# రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు

(మొదటి పేజీ తరువాయి)

అర్హులకు చేరేలా ఈ కార్యక్రమం జరగాలి. తెలంగాణ రైజింగ్ 2047' విజన్ తో ఆర్థికంగానే కాక, అన్నీ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలో నెంబర్ వన్ గా నిలపాలన్నది మన సంకల్పం. ఈ సంకల్పంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. క్యూర్,ప్యూర్, రేర్‌గా రాష్ట్రాన్ని వర్గీకరించుకున్నాం. వాటి పరిధిలో సేవా, తయారీ, వ్యవసాయ రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా మనం ఎదగాలి. 99 రోజుల కార్యాచరణ ఒక సాధారణ కార్యక్రమం కాదు.. ఒక దీక్ష. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఒక్కటై... దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా ఎదగాలి. ఇదే నా కల. ఆ కలను సాకారం చేయడంలో ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలి. మీ అందరి సహకారాన్ని కోరుకుంటూ మీ రేవంత్ రెడ్డి అన్న సందేశాన్ని విడుదల చేశారు.

# చేనేత ఆర్డర్ల రద్దుతో కార్మికులపై కక్ష

(మొదటి పేజీ తరువాయి)

చూపనుందని.. కార్మికులు వీధిన పడే దుస్థితి వచ్చిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ శాఖలకు చెందిన దుప్పట్లు, దుస్తులకు సంబంధించి రూ.200 కోట్ల ఆర్డర్లను కూడా తెలంగాణ చేనేతలకు ఇవ్వలేదని ఆరోపణలు గుప్పించారు. ÷స్కోకు ఆర్డర్లు ఇవ్వకుండా సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని రేవంత్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు కవిత. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కార్మికులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు కల్వకుంట్ల కవిత.

# కమీషన్ల కోసమే టెస్కోకు ఆర్డర్లు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

రూ. 105 కోట్ల విలువ గల స్కూల్ యూనిఫామ్ ఆర్డర్‌ను వెనక్కి తీసుకోవడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. సంక్షేమ శాఖ నుండి టెస్కోకు దక్కాల్సిన రూ. 200 కోట్ల దుస్తులు, దుప్పట్ల ఆర్డర్ ఇంకా ఇవ్వకపోవడం వెనుక కారణం ఏంటి..? అని అడిగారు.

కాంగ్రెస్ దండుపాళ్యం ముఠా కమీషన్లు దండుకోవాలనే యావలో ప్రైవేట్ వ్యక్తులకు ఆర్డర్లు ఇస్తున్నదని ధ్వజమెత్తారు. నేతన్నల ఉసురు పోసుకుంటున్న కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

# రాష్ట్రప్రజలకు కెసిఆర్ హనుమత్ జయంతి శుభాకాక్షలు



**హైదరాబాద్,ఏప్రిల్ 02 (పిసీడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ సీతారామచంద్రమూర్తి భక్తుడుగా, బలం, జ్ఞానం, వాక్చాతుర్యం అన్నీకలిసి, అరుదైన వ్యక్తిత్వం కలిగిన జ్ఞానిగా, హిందూ పురాణాలు హనుమంతుడిని కీర్తిస్తాయని కేసీఆర్ తెలిపారు. సంత్ తులసీదాస్ తన రామచరిత మానస్‌లో చెప్పినట్టు అంజనీ సుతుడు జ్ఞానినాం అగ్రగణ్యం., అంటే జ్ఞానుల్లో అత్యున్నతుడు..అని కేసీఆర్ పేర్కొన్నారు. వాల్మీకి రామాయణంలో శ్రీరాముడు అన్నట్టు 'న వాక్యదోషం నచ అపశబ్దం'..అంటే., ఎటువంటి దోషాలు లేని భాషతో, ఉచ్చారణతో, వ్యాకరణం మీద పట్టుతో వాక్ శుద్ధితో ప్రసంగించే గొప్ప వక్త హనుమంతుడు అని కేసీఆర్ కొనియాడారు. ధర్మరక్షణ కోసం, తాను నమ్మిన శ్రీ రామునికి తన శక్తినంతా ధారపోసి, ఎటువంటి ప్రతి ఫలాపేక్ష లేకుండా, ప్రజా సంక్షేమం కోసం నాయకత్వాన్ని తన భుజాలమీద మోసిన బలశాలి, వినయానికి ,విజయానికి మార్గదర్శి, మృదుస్వభావి శ్రీ ఆంజనేయ స్వామి అని కేసీఆర్ కొనియాడారు. జ్ఞానం వాక్చాతుర్యం బలం భక్తి వినయం అన్నీ కలెగలిసిన సంపూర్ణ వ్యక్తిత్వం హనుమంతుడికే సాధ్యం అన్నారు. వారి ఆచరణ ఎల్లకాలం ఆదర్శనీయమని, నేటి యువతరానికి ఆచరణీయమని కేసీఆర్ తెలిపారు. ఆదర్శవంతమైన ఆలోచనలతో, దూరదృష్టితో, తమ జీవితాలను తీర్చిదిద్దుకునే శక్తిని హనుమంతుడు రాష్ట్ర ప్రజలకు అందించాలని, ప్రగతి తిరిగి పుంజుకుని రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా చూడాలని కేసీఆర్ ప్రార్థించారు.

## తూతూ మంత్రంగా ప్రజాపాలన కార్యక్రమం...

# ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం ఎందుకు?



**పరకాల, ఏప్రిల్ 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంపై స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలను సమగ్రంగా తెలుసుకుని పరిష్కరించాల్సిన ఈ కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా నిర్వహించడం దురదృష్టకరమని ఒకటో వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ దుబాసి వెంకటస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముందు సరైన సమాచారం ఇవ్వకపోవడం వల్ల చాలా మంది వార్డు ప్రజలకు తెలియకుండానే హడావుడిగా నిర్వహించారని ఆయన ఆరోపించారు. గతంలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను తిరిగి తీసుకోవడం సరికాదని, అవి అలాగే తాజా దరఖాస్తులను వెంటనే పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఎండాకాలం తీవ్రంగా ఉండడంతో పట్టణంలో నీటి సమస్య మరింత విషమించిందని పేర్కొన్నారు. నల్లాల ద్వారా సరైన నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీధి దీపాల లోపం, డ్రైనేజీ సమస్యలతో మురుగు వాసన వ్యాపించి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందన్నారు. దోమలు, వీధి కుక్కలు, కోతుల సమస్యలు కూడా పెరిగి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఈ సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే ప్రజలతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రజాపాలన కార్యక్రమం నిజమైన ప్రజా సేవగా మారాలంటే అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.

# అంబేద్కర్ నగర్ 16 వార్డ్‌లో గ్రామసభ

**ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం: కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు**





**కల్లూరు, ఏప్రియల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణలో కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ నగర్ 16వ వార్డులో గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని 16వ వార్డు కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి వార్డు కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ గ్రామసభలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా డ్రైనేజ్, రోడ్లు, తాగునీరు, హౌసింగ్, వీధి దీపాల వంటి సమస్యలను ప్రజలు ప్రస్తావించారు. ప్రజలు చెప్పిన ప్రతి సమస్యను జాగ్రత్తగా విన్న కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, వాటిని సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. అదేవిధంగా, ప్రజల నుండి వచ్చిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అభివృద్ధే తన లక్ష్యమని, వార్డ్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ సరోజినీ, మున్సిపాలిటీ హౌసింగ్ ఏఈ మమత, అంగన్వాడి టీచర్ గుర్రాల సావిత్రి, ఆశ వర్కర్ ఉబ్బన లక్ష్మీకాంతం పాల్గొని తమ శాఖలకు సంబంధించిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల సమస్యలపై వారు చర్చించారు. వారు కూడా వార్డ్ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ గ్రామసభలో 16వ వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను వినిపించడం జరిగింది. అధికారులు, ప్రజల మధ్య ప్రత్యక్ష సంభాషణ జరగడం వల్ల సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఈ గ్రామసభ ప్రజలకు దగ్గరగా పరిపాలనను తీసుకువెళ్లే ఒక మంచి వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉబ్బన శ్రీనివాసరావు, ఉబ్బన బాబురావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి సైబర్ కేసులో కీలక మలుపు...

**ముగ్గురు బ్యాంకు ఉద్యోగుల అరెస్ట్**


**సిఎస్బి బ్యాంక్ సిబ్బందిపై పోలీసుల కఠిన చర్యలు**

**అరెస్టు చేసిన ముగ్గురిని రిమాండ్‌కు తరలింపు**

**పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు**



**సత్తుపల్లి, ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన సైబర్ నేర కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో భాగంగా ముగ్గురు బ్యాంకు ఉద్యోగులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఉడతనేని వికాస్ చౌదరి, బొప్పన నాగప్రియ, అలాగే సీఎస్‌బీ బ్యాంక్ చంద్రుగొండ మేనేజర్ అఖీల్ అబ్దుల్ పేర్లు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. వీరికి సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎస్‌బీ బ్యాంక్ చంద్రుగొండకు చెందిన ఉద్యోగులపై పోలీసులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో ఒర్సు కృప, మందా శ్రీహరి బాబు, జుంజునూరి రాధా కృష్ణ అను వ్యక్తులపై కేసు దర్యాప్తు అధికారిగా సత్తుపల్లి ఇన్‌స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి వారిని అరెస్ట్ చేసి, అనంతరం న్యాయస్థానానికి హాజరు పరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు దర్యాప్తు వేగవంతంగా కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. ఇంకా పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఏసీపీ వసుంధర యాదవ్ వెల్లడించారు. త్వరలోనే మిగతా నిందితులను కూడా అదుపులోకి తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా ఎవరైనా పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఈ ఘటనతో బ్యాంకింగ్ వ్యవస్థలో భద్రతా ప్రమాణాలపై మరోసారి చర్చ మొదలైంది. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద లావాదేవీలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. మొత్తానికి సత్తుపల్లి సైబర్ కేసులో పోలీసుల చర్యలు మరింత వేగవంతం కావడంతో ఈ కేసు త్వరలోనే పూర్తిస్థాయిలో ఛేదన అవుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ సమావేశంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# శాంతినగర్ 18 వార్డ్‌లో గ్రామసభ : కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ





**కల్లూరు, ఏప్రియల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణలో కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ 18వ వార్డులో గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని 18వ వార్డు కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ గ్రామసభలో స్థానిక ప్రజలు పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా డ్రైనేజ్, రోడ్లు, తాగునీరు, హౌసింగ్, వీధి దీపాల వంటి సమస్యలను ప్రజలు ప్రస్తావించారు. ప్రజలు చెప్పిన ప్రతి సమస్యను జాగ్రత్తగా విన్న కౌన్సిలర్ రామ కృష్ణ వాటిని సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజల అభివృద్ధే తన లక్ష్యమని, వార్డ్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ ముఖ్యమంత్రి సందేశాన్ని గ్రామ సభలో చదివి వినిపించారు. ప్రభుత్వం చేస్తున్న పలు అభివృద్ధి పథకాలను గూర్చి వారు వివరించారు. గ్రామ సభ దృష్టికి తీసుకుని వచ్చిన ప్రజల సమస్యలపై వారు చర్చించారు. వారు కూడా వార్డ్ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ప్రజప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఈ గ్రామసభ ప్రజలకు దగ్గరగా పరిపాలనను తీసుకువెళ్లే ఒక మంచి వేదికగా నిలిచింది అని అన్నారు. సంతాన వేణుగోపాలస్వామి చైర్మన్ ధార రంగ, మాజీ ఎంపీటీసీ ఖమ్మంపాటి పుల్లారావు, రాచమల్ల నాగేశ్వరరావు, కళ్యాణపు కిషోర్, ఖమ్మంపాటి రమేష్, గుండ్ర తిరుమల, అంగన్వాడి టీచర్లు నడ్డి పద్మ, సంగేపు జమున, ఆశా కార్యకర్తలు జమలమ్మ, నల్లగట్ల అఖిల్, దాసరి ప్రశాంత్, మున్సిపాలిటీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందించడమే లక్ష్యం

**• చింతలపల్లి గ్రామ సర్పంచ్ కుమ్మరి నరేష్**



**మొగుళ్లపల్లి, ఏప్రిల్ 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన చేస్తుందని, ప్రజా పాలనలో భాగంగా ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను అర్హులైన నిరుపేద ప్రజలకు అందించడమే లక్ష్యంగా పనిచేసేందుకు తమ వంతుగా కృషి చేస్తామని చింతలపల్లి గ్రామ సర్పంచ్ కుమ్మరి నరేష్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని చింతలపల్లి గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం చింతలపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామసభను నిర్వహించడం జరిగింది. ఈ గ్రామ సభకు సర్పంచ్ కుమ్మరి నరేష్ అధ్యక్షతన వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి మొగుళ్లపల్లి ఎస్ఐ ముప్పు సురేష్ గ్రామ సభనుద్దేశించి మాట్లాడారు. గ్రామంలో ఏలాంటి గొడవలు లేకుండా, శాంతి భద్రతలకు ఆటంకం కలగకుండా ఉండాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు కావద్దని, రోడ్డు ప్రమాదాలకు గురికా వద్దన్నారు. అనంతరం స్పెషల్ ఆఫీసర్ శ్రీకాంత్ మాట్లాడారు. గ్రామంలో ఏవైనా భూ సమస్యలు ఉంటే వాటి పరిష్కారం కోసం సర్పంచ్ మరియు సంబంధిత అధికారులను సంప్రదించాలని, వ్యవసాయ రంగంలో క్షేత్రస్థాయిలో సహజ ఎరువులను వాడాలని, భూసారాన్ని పెంచుకోవాలన్నారు. గ్రామ సభలో నేరుగా ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మంద కార్తీక్, కార్యదర్శి హేమంత్, వార్డు సభ్యులు, డీలర్, ఫీల్డ్ అసిస్టెంట్, ఆశా వర్కర్, మహిళలు, యువత, గ్రామ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మీసేవ సర్వీసులకు తాత్కాలిక అంతరాయం

**సర్వర్ నిర్వహణ పనుల కారణంగా ఏప్రిల్ 3 రాత్రి 10 గంటల నుంచి ఏప్రిల్ 5 ఉదయం 8 గంటల వరకు సేవల నిలుపుదల**

**వినియోగదారులు గమనించగలరు: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**



**ములుగు జిల్లా,ఏప్రిల్ 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** సర్వర్ నిర్వహణ పనుల నేపద్యం లో మీసేవ ఆన్లైన్ సేవలకు తాత్కాలిక అంతరాయం ఏర్పడనున్నట్లు ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. ఏప్రిల్ 3 రాత్రి 10 గంటల నుంచి ఏప్రిల్ 5 ఉదయం 8 గంటల వరకు నిర్వహణ పనులు కొనసాగనున్నట్లు తెలిపారు. సర్వర్ పనితీరు మెరుగుదల, భద్రత వ్యవస్థల సాంకేతిక సమస్యల నివారణ కోసం ఈ నిర్వహణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమయంలో సంబంధిత విభాగాలకు చెందిన ఆన్లైన్ సేవలు డిజిటల్ లావాదేవీలు, వెబ్ పోర్టల్ సేవలు తాత్కాలికంగా పనిచేయవని, జిల్లా ప్రజలు అత్యవసర సేవలను ముందుగానే వినియోగించుకోవాలని సూచించారు. నిర్వహణ పూర్తయిన అనంతరం సేవలు సాధారణ స్థితికి చేరుకుంటాయని తెలిపారు. సాంకేతిక వ్యవస్థలను ఆధునీకరించడంలో భాగంగానే ఈ చర్యలు చేపడుతున్నామని, భవిష్యత్తులో వేగవంతమైన అంతరాయం లేని సేవలను అందించేందుకు ఈ నిర్వహణ ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటన లో వెల్లడించారు.

# వీర వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న 316వ వర్ధంతి...

**ములుగులో పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించిన గౌడ సంఘం నాయకులు**





**మల్లంపల్లి మండల ప్రతినిధి ఏప్రిల్ 2(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా కేంద్రంలో వీర వీరుడైన సర్దార్ సర్వాయి పాపన్న గారి 316వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు తోటకూరి శ్రీకాంత్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పాపన్న గారి విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గారు దోపిడీ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అసలైన ప్రజా నాయకుడని పేర్కొన్నారు. సామాజిక సమానత్వం, న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. పాపన్న గారి ధైర్యసాహసాలు, సమానత్వ భావం, ప్రజల పట్ల ఉన్న అంకితభావం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో యువత పాపన్న గారి చరిత్రను తెలుసుకొని ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. పాపన్న గారి సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. “పాపన్న గారి పోరాట స్ఫూర్తి మన సమాజానికి దిక్సూచి” అని ఆయన అన్నారు.

# హోంగార్డు శ్రీనివాసరావుకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర



**సత్తుపల్లి, ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హోంగార్డు బుద్ధ శ్రీనివాసరావు చిత్రపటానికి సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న బుద్దా శ్రీనివాసరావు సత్తుపల్లి మండలం రామానగరం గ్రామంలోని తన స్వగృహంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కన్నవారి కవచం సంరక్షణ బిల్లు

తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన తల్లిదండ్రుల పోషణ బిల్లుకు అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం చరిత్రత్మకం..ప్రభుత్వం ఈ బిల్లుకు రూపకల్పన చేయడం ఒక సామాజిక విప్లవంగా అభివర్ణించవచ్చు. కన్నవారిని నిర్లక్ష్యం చేసే ఉద్యోగుల జీతం నుండి 15% కోత తీసి ఆ మొత్తాన్ని నేరుగా తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించడం అభినందనీయం. భారతీయ సంస్కృతిలో మాతృదేవోభవ -పితృదేవోభవ అనేది కేవలం ఒక సూక్తి మాత్రమే కాదు అది ఒక జీవన విధానం కానీ ఆధునిక పోకడలు వ్యక్తిగత స్వార్థము పెరగడం వల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కుప్పకూలింది. లక్షల్లో జీతాలు తీసుకుంటూ విలాస వంతమైన జీవితం గడుపుతున్న కొందరు తమను పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో అనాథలుగా వదిలేస్తున్నారు. ఈ సామాజిక క్యాన్సర్ను నయం చేయడానికి కేవలం నీతి వాక్యాలు సరిపోవని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక ఆంక్షల ద్వారా బాధ్యతలు గుర్తు చేసేందుకు సిద్ధమైంది.కన్నవారి కన్నీరు తుడిచే ఈ చట్టం అమల్లోకి వస్తే వృద్ధాప్యంలో ఉన్న ఎందరికో అది ఆసరాగా మారుతుంది. ఉద్యోగం అనేది కేవలం వ్యక్తిగత ఆస్తి కాదు అది సమాజానికి కుటుంబానికి జవాబు దారిగా ఉండాలని నొప్పి చెప్పడం. తల్లిదండ్రుల కష్టార్జితంతో చదువుకొని సంపాదించిన పిల్లల సంపాదనలో తల్లిదండ్రులకు చట్టబద్ధమైన వాటా కల్పించడం లాంటివి ఇందులో ఉన్నాయి. అటువంటి ఆర్థిక సహాయం అందుతుందనే భరోసా ఉంటే చాలామంది వృద్ధులు ఆశ్రమాలకు వెళ్లడం మానేసి తమ సొంత ఊర్లోనే గౌరవంగా జీవించగలరు జీతం అవుతుందనే భయంతో నైనా కనీసం లోకనిందకు భయపడి తల్లిదండ్రులను ఇంటికి తీసుకెళ్లే పరిస్థితులు ఏర్పడవచ్చు వృద్ధాప్యంలో వచ్చే జబ్బులకు చికిత్స చేయించుకోవడానికి డబ్బులు లేక అలమటించే వారికి ఈ 15% శాతం జీతం ఒక సంజీవినిలా మారుతుంది. నానానికి రెండోవైపు ఉన్నట్లుగా చట్టం అమల్లో కొన్ని చిక్కులు లేకపోలేదు బలవంతంగా జీతం నుంచి డబ్బులు తీసుకుంటే అది తల్లిదండ్రులు పిల్లల మధ్య ప్రేమానురాగాలను మరింత దూరం చేయవచ్చు డబ్బులు ఇచ్చినప్పటికీ మానసిక హింస పెరిగే ప్రమాదం ఉంది కుటుంబ తగాదాల వల్ల కొందరు తల్లిదండ్రులు తప్పుడు ఫిర్యాదులు చేసే అవకాశం ఉంటుంది దీనిని అరికట్టడానికి అత్యంత పారదర్శకమైన విచారణ వ్యవస్థ ఉండాలి. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు లు అంటే సరే కానీ అత్యధిక సంపాదన ఉన్న ప్రైవేటు ,ఐటి రంగ ఉద్యోగులను దీని పరిధిలోకి ఎలా తీసుకొస్తారనేది పెద్ద సవాలనే చెప్పాలి. భారతదేశంలో అస్సాం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఈ తరహా లిప్రణామ్‌లిను విజయవంతంగా అమలు చేస్తుంది. అక్కడ కూడా ఉద్యోగి జీతం నుండి 10 నుండి15 శాతం కోత విధిస్తారు. దీనిని పూర్తిగా తెలంగాణ ప్రభుత్వం ఆ మోడల్ను మరింత పకడ్బందీగా, వికలాంగులైన తోబుట్టు వుల బాధ్యతలు కూడా చేర్చి అమలు చేయాలని భావిస్తుంది.పాఠశాల దశ నుంచే నైతిక విలువలను బోధించడం, తల్లిదండ్రుల పట్ల బాధ్యతలను పెంచడం వంటివి సమాంతరంగా జరగాలి .చివరకు తల్లిదండ్రుల ను గౌరవించడం అనేది ఒక ఆప్షన్ కాదు అది తప్పనిసరి బాధ్యత అని చట్టం స్పష్టం చేస్తుంది.


సేకరణ..మార్త బిక్షపతి సేవా రత్న నేషనల్ అవార్డు గ్రహీత 9885000293

## ములుగు జిల్లా పోలీసు కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 135వ జయంతి పోస్టర్ ఆవిష్కరణ



**ములుగు జిల్లా, ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్)** :భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ గారి 135వ జయంతిని పురస్కరించుకుని ములుగు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ గారు జయంతి ఉత్సవాల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ ఆదర్శప్రాయుడు అంబేడ్కర్ గారు చూపిన మార్గం సమాజానికి ఎంతో ఆదర్శప్రాయమని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.సమానత్వం రాజ్యాంగం ద్వారా ఆయన కల్పించిన హక్కులు, సమానత్వం నేటి సమాజానికి పునాదులని కొనియాడారు.క్రమశిక్షణ పోలీసు శాఖ కూడా అంబేడ్కర్ గారు బోధించిన క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు మరియు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఏప్రిల్ 14న నిర్వహించనున్న జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు

## ఉరివేసుకొని మహిళా మృతి



**గంగాధర ఏప్రిల్ 2(పిసిడబ్ల్యూ న్యూస్ ):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజు తేదీ 02/04/2026 గంగాధర మండల పరిధిలోని మధురానగర్ గ్రామానికి చెందిన దూస లత భర్త శంకరయ్య, వయస్సు 45 సంవత్సరాలు కలిగిన మహిళ తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం రాగా . ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే గంగాధర ఎస్సై వంశీకృష్ణ గారు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితులను పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించి ,పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. కుటుంబ సభ్యులు మరియు స్థానికుల ప్రకారం, ఆత్మహత్య చేసుకున్న మహిళ గత సంవత్సర కాలంగా మానసిక స్థితి సరిగా లేక బాధపడుతుండేది.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా నయం కావడంలేదు.నిన్న సాయంత్రం వరకు బాగానే ఉన్న మహిళ ఈ రోజు ఉదయం మహిళ పడుకున్న గది యొక్క తలుపు తియ్యకపోయేసరికి అనుమానంతో మహిళ భర్త గది తలుపు లు పగులగొట్టి చూసేసరికి ఇంట్లో కిటికీ ఉన్న వైర్ తో ఉరిపెట్టుకొని చనిపోయి ఉన్నట్లు మహిళ భర్త శంకరయ్య పిర్యాదు చేయగా,ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు గంగాధర ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

# జిల్లాలో మున్సిపాలిటీ ప్రథమ స్థానమే లక్ష్యం

**చైర్మన్ మోహన్ నాయక్ ధృడ సంకల్పం**

**హనుమతండా గ్రామసభలో సంక్షేమ పథకాలపై అవగాహన**

**ప్రజలతో నేరుగా మమేకమైన మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్**



**కల్లూరు, ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జిల్లాలో కల్లూరు మున్సిపాలిటీని ప్రథమ స్థానంలో నిలబెట్టటమే ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ అన్నారు. కల్లూరు మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా మరో ముందడుగు వేస్తూ, మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ తన సొంత 7వ వార్డులో గ్రామసభను నిర్వహించి ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా హనుమతండా గ్రామంలో నిర్వహించిన ఈ గ్రామసభ విశేష స్పందనను పొందింది.చైర్మన్ మోహన్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరంగా తెలియజేశారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. కల్లూరు మున్సిపాలిటీని రాబోయే రోజుల్లో జిల్లాలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నానని ఆయన పేర్కొ న్నారు. ఇందుకోసం పారదర్శక పరిపాలన, సమర్థవంతమైన సేవలు, ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని తెలిపారు. గ్రామసభలో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ గ్రామసభ ద్వారా ప్రజలతో ప్రత్యక్ష సంబంధాన్ని పెంపొందించడమే కాకుండా, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల సహకారం పొందడంలో చైర్మన్ మోహన్ నాయక్ కీలక పాత్ర పోషిస్తున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. విద్యుత్ శాఖ డి రాంబాబు, విద్యుత్ శాఖ మండల అధికారి మహేంద్ర బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిరాం, లాల్ సింగ్, లక్ష్మ, మోహన్, గోబ్రియ, బాలు, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు ధరావత్ రవికుమార్, మహిళలు, పెద్ద సంఖ్యలో పలువురు పాల్గొన్నారు.

## సబ్-కలెక్టర్ కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి ఘనంగా నిర్వహణ



**కల్లూరు, ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్)** : సబ్-కలెక్టర్ కార్యాలయంలో వీరశూరుడు సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని సబ్-కలెక్టర్ అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి, అధికారులు, సిబ్బంది కలిసి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సబ్-కలెక్టర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న స్వాతంత్ర్య పోరాటంలో చూపిన ధైర్యసాహసాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడిన మహోన్నత వ్యక్తిగా చరిత్రలో నిలిచారని అన్నారు. సమాజంలో సమానత్వం, న్యాయం కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు.కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు కూడా పాపన్న సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేస్తూ, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజా పాలన గ్రామసభలు

**అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తాం: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**





**గంగాధర ఏప్రిల్ 2(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం మధురానగర్ లో నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక గ్రామ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం. గ్రామాల్లో ఉన్న సమస్యలు, ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలను తెలుసుకోవడానికి ప్రభుత్వం గ్రామాల్లో ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక గ్రామ సభలను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండలం మధురానగర్ గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభలో జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి ఎమ్మెల్యే సత్యం ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు, ఇందిరమ్మ ఇండ్లను కట్టిస్తున్నట్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఉచితంగా సన్న బియ్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం వర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు, మరో 3500 ఇండ్లు రానున్నట్లు తెలిపారు. చొప్పదండిలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రానున్న రోజుల్లో చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వేముల భాస్కర్, ఎంపీడీవో రాము,ఉప సర్పంచ్ తూం రాజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలు జరగకుండా పాటించాలి




**చిట్యాల ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాల కళాశాలలో ప్రిన్సిపాల్ మేకల రమేష్ ఆధ్వర్యంలో స్కౌట్ అండ్ గైడ్స్ టీచర్స్ వాని మేడం అశోక్ సమక్షంలో చిట్యాల చౌరస్తా నుండి గ్రామపంచాయతీ వరకు రోడ్డు భద్రత నియమాలు పాటించవలసిన విషయాలు ప్రమాదాలు నివారించడం ఎలా అనేటటువంటి అంశాలపై ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు అనంతరం గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ లక్ష్మి. నవీన్ వార్డ్ మెంబర్. గ్రామ కార్యదర్శి సమక్షంలో స్కౌట్ అండ్ గైడ్స్ పిల్లలతోటి నాటకాలు పాటలు ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచ్ ఉప సర్పంచ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా పాటించవలసిన విషయాలు చాలా చక్కగా వివరించారు అదేవిధంగా భవిష్యత్తులో ఎలాంటి సంఘటనలు జరగకుండా తల్లిదండ్రులు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవడం వారికి తగిన సూచనలు ఇవ్వడం డ్రైవింగ్ లైసెన్స్ హెల్మెంట్ ఇన్సూరెన్స్ తప్పకుండా ఉండాలని పిల్లల ద్వారా తెలియజేయడం చాలా గొప్పనైన విషయమని ఈ సందేశము ప్రజలకు తెలియజేస్తూ మనందరం పాటించాలని ప్రతిజ్ఞ చేయడం అభినందనీయమని అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వాసాల వెంకటేశ్వర్లు రాజు రామ్ సార్ అంగన్వాడి సిబ్బంది మరియు గ్రామపంచాయతీ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు

**హాజరైన సర్పంచ్ పెరిక నాగేశ్వరావు, రావుల గోపి గౌడ్**





**తల్లాడ, ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బహుజన రాజ్యాధికార పోరాటయోధుడు, తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలను గురువారం తల్లాడలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు (చిన్నబ్బాయి), గౌడ సంఘం జిల్లా నాయకులు రావుల గోపి గౌడ్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్దార్ పాపన్న గౌడ్ తెలంగాణ ప్రాంతం కోసం ఆనాడు రజాకార్లను ఎదిరించి అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. బహుజన రాజ్యాధికారమే ధ్యేయంగా ఉద్యమాలు చేశారని అన్నారు. ఆ మహానుభావుడిని స్ఫూర్తిగా తీసుకొని యువత బహుజనుల రాజ్యాధికారం కోసం ఆయన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. తొలుత ఆయన చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ్ సంఘం తల్లాడ మండల అధ్యక్షులు గుండ్ల నాగయ్య, ఉపాధ్యక్షులు గుండ్ల వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా అధ్యక్షులు సమ్మెట రామకృష్ణ, మాజీ సర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు, సున్నం హరీష్, మొక్కా నవీన్, మొక్కా తిరుపతిరావు, సత్యనారాయణ బొడ్డు రామ్ లక్ష్మణ్, బొడ్డు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ వాదాన్ని ముందుకు తీసుకువెళ్లిన బొమ్మల కట్టయ్య సేవలు మరువలేనివి





**చిట్యాల ఏప్రిల్ 2 (పీసీడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జన్నే యుగేందర్ అధ్వర్యంలో అంబేద్కర్ యువజన సంఘం మరియు మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బొమ్మల కట్టయ్య గారి 82వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా కట్టయ్య చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్యలు మాట్లాడుతూ గ్రామా స్థాయి నుండి అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తు,అంబేద్కర్ యువజన సంఘాలను బలోపేతం చేసి అంబేద్కర్ వాదాన్ని ముందుకు తీసుకెళ్ళుతూ యెనలేని కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ ఎస్టీ రాష్ట్ర నాయకులు దెబ్బటా రమేష్ అంబేద్కర్ సాంగ్ యోజన సంఘం మండల ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు మొగుళ్ళపల్లి నాయకులు బందారి రాజు చిట్యాల మండల్ నాయకులు సదానంద శివాజీ తదితరులు పాల్గొన్నారు

## 'యశోద'లో కీలు నొప్పుల కష్టాలకు 'రోబోటిక్' పరిష్కారం

**- సామాన్యుడికి అందుబాటులో అత్యాధునిక వైద్యం**

**- యశోద హాస్పిటల్ (సోమాజిగూడ) ప్రముఖ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ అభిషేక్ బర్లీ**



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మోకాళ్ళు, తుంటి నొప్పులతో కదల్లేక, కన్నీరుమున్నీరవుతున్న రోగుల జీవితాల్లో 'రోబోటిక్' శస్త్రచికిత్సతో కొత్త వెలుగులు నింపేందుకు యశోద హాస్పిటల్ (సోమాజిగూడ) అడుగులు వేస్తోందని ప్రముఖ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ అభిషేక్ బర్లీ అన్నారు. ఖమ్మం యశోద మెడికల్ సెంటర్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ అభిషేక్ బర్లీ మాట్లాడుతూ... అతి తక్కువ ఖర్చుతో కూడిన ఆధునిక రోబోటిక్ కీలు మార్పిడి చికిత్సల ప్రాముఖ్యతను వివరించారు. **భయం వద్దు.. భరోసా ఇస్తాం : 24 గంటల్లోనే నడక మొదలు** చాలామంది ఆపరేషన్ అంటేనే భయం, ఆ తర్వాత ఎదురయ్యే ఇబ్బందుల గురించి ఆందోళన చెందుతుంటారు. కానీ, డాక్టర్ అభిషేక్ బర్లీ ఆ అపోహలను పటాపంచలు చేశారు. రోబోటిక్ టెక్నాలజీతో చేసే ఈ శస్త్రచికిత్సలు అత్యంత ఖచ్చితత్వంతో ఉంటాయని, శస్త్రచికిత్స జరిగిన కేవలం 24 గంటల్లోనే రోగి లేచి నడవచ్చని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బాడీ ఫిట్నెస్ ఆధారంగా అవసరమైతే రెండు మోకాళ్ళకు ఒకేసారి ఆపరేషన్ చేసే వెసులుబాటు కూడా ఉందని ఆయన పేర్కొన్నారు. **30 ఏళ్ల గ్యారెంటీ... మీ గడప వద్దకే నిపుణులైన వైద్యులు** ఒక్కసారి ఈ శస్త్రచికిత్స చేయించుకుంటే సుమారు 30 ఏళ్ల పాటు మళ్లీ ఆపరేషన్ అవసరం ఉండదని, అయితే శస్త్రచికిత్స అనంతరం నెలకు సరిపడా ఫిజియోథెరపీ తప్పనిసరి అని వైద్యులు సూచించారు. ఖమ్మంతో పాటు ఖమ్మం చుట్టుపక్కల జిల్లాల ప్రాంతవాసుల సౌకర్యార్థం మరో కీలక నిర్ణయాన్ని ప్రకటించారు. ఆపరేషన్ తర్వాత చెకప్ కోసం ప్రతిసారీ హైదరాబాద్ వెళ్లాల్సిన పని లేకుండా 'ప్రతి నెల మొదటి గురువారం' ఆర్థోపెడిక్ నిపుణులు ఖమ్మంలోనే అందుబాటులో ఉంటారు. ఈ అవకాశాన్ని ఖమ్మం ప్రజలు సద్వినియోగం చేసుకొని, నొప్పుల నుంచి విముక్తి పొంది ఆనందంగా జీవించాలని వైద్య బృందం ఆకాంక్షించింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. విక్రమ్ కుమార్, యశోద హాస్పిటల్ (సోమాజిగూడ) మేనేజర్ శ్రీధర్ రావు, అసిస్టెంట్ మేనేజర్లు బాలకృష్ణ, నవీన్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.


## విజయవంతంగా ముగిసిన 'ప్రజా పాలన వార్డు సభ'



10వ వార్డ్ కౌన్సిలర్ పొడాలా సుస్మిత



13 వ వార్డ్ కౌన్సిలర్ సిలివేరు సాంబయ్య



12 వ వార్డ్ కౌన్సిలర్ పోరిక రాజు నాయక్



11వ వార్డ్ కౌన్సిలర్ కేశెట్టి నవీన్

**ములుగు, ఏప్రిల్ 2 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా ఈరోజు (02.04.2026) ములుగు మునిసిపాలిటీ బండారుపల్లి పరిధిలోని 10,11,12,13నాలుగు వార్డులలో వార్డు సభను విజయవంతంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై, తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బండారుపల్లి కౌన్సిలర్స్ 10వ వార్డ్ పొడాలా సుస్మిత 11 వ వార్డ్ కేశెట్టి నవీన్,13 వ వార్డ్ సిలివేరు సాంబయ్య, 12 వ వార్డ్ పోరిక రాజునాయక్ గార్లు స్వయంగా పాల్గొని ప్రజలతో ముఖాముఖి చర్చించారు. తక్షణ పరిష్కారం కావాల్సిన సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ హామీ ఇచ్చారు. మునిసిపల్ అధికారులు, సిబ్బంది సమక్షంలో ప్రభుత్వ పథకాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ప్రజల సమస్యలు, అభివృద్ధి సూచనలను నమోదు చేసుకుని, పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ సభ సాగింది. వార్డు ప్రజల ఉత్సాహపూరిత భాగస్వామ్యంతో ఈ సభ అత్యంత విజయవంతమైందని అధికారులు పేర్కొన్నారు.

## చిలుకోయలపాడు గ్రామంలో అట్టహాసంగా గ్రామసభ వేడుకలు

**గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం అత్యవసరం**

**గ్రామ సర్పంచ్ ఊడుగుల వెంకన్న పిలుపు**



**సిరోల్, ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** సిరోల్ మండలం చిలుకోయలపాడు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర గీతం ఆలాపనతో గ్రామసభ సమావేశం అట్టహాసంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది. గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో హాజరై గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించడం కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది. గ్రామ ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ గ్రామసభ ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఊడుగుల వెంకన్న మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామ సమస్యలను గ్రామసభలోనే చర్చించి పరిష్కార మార్గాలను కనుగొనడం ద్వారా అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, డ్రైనేజ్ వ్యవస్థ మెరుగుదల, పచ్చదనం పెంపు వంటి అంశాలపై గ్రామ ప్రజల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని సర్పంచ్ హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రభుత్వ పథకాల వినియోగంపై అవగాహన కల్పించారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు యువత, మహిళలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మేకల సమత సైదులు,గ్రామ స్పెషల్ ఆఫీసర్ మహమ్మద్ గౌస్,గ్రామ కార్యదర్శి యాకూబ్ పాషా, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యా యులు పేరయ్య, విద్యుత్ అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బుడిగం లక్ష్మీనారాయణ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ సిఏ ఎస్కె నజ్రిన్, మహిళా సంఘాల సభ్యులు, అంగన్వాడి టీచర్స్, ఆశ వర్కర్లు, రేషన్ డీలర్,యువకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని గ్రామ అభివృద్ధిపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామసభ విజయవంతంగా నిర్వహించబడటంపై గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

## బాధ్యతండ అభివృద్ధికి కొత్త ఊపు సర్పంచ్ పెంట్యా నాయక్ నేతృత్వంలో గ్రామం ప్రగతి పథంలో



**రఘునాథపాలెం, ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** రఘునాథపాలెం మండలం బాధ్యతండ గ్రామం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోంది. గ్రామ సర్పంచ్ పెంట్యా నాయక్ గారి చురుకైన నాయకత్వం, ప్రణాళికాబద్ధమైన చర్యలతో గ్రామంలో అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతూ ప్రజల్లో నూతన ఆశలు నింపుతున్నాయి. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. గ్రామంలో ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం చేపట్టడంతో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడుతున్నాయి. పాఠశాల ప్రాంగణంలో మట్టి పోపీయడం ద్వారా విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతోంది. గ్రామపంచాయతీ కార్యాలయం పరిసరాల్లో మట్టి పనులు చేపట్టి ప్రాంతాన్ని శుభ్రంగా, అందంగా తీర్చిదిద్దుతున్నారు. అదేవిధంగా ఆంజనేయ స్వామి దేవాలయానికి పారి కట్టడం ద్వారా భక్తులకు మరింత సౌకర్యం కల్పిస్తున్నారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా రూ.36 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ రోడ్లు పూర్తయిన తర్వాత గ్రామంలో రవాణా సౌకర్యాలు మెరుగై ప్రజలకు ఎంతో ప్రయోజనం కలగనుంది. తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కొత్త హ్యాండ్ పంపులు ఏర్పాటు చేయడం ద్వారా గ్రామ ప్రజలకు ఉపశమనం కలిగింది. ఈ అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగా బాధ్యతండ గ్రామం రోజురోజుకు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతూ ఆదర్శ గ్రామంగా మారుతోంది. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని సర్పంచ్ పెంట్యా నాయక్ తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలలో చిన్నారుల బంగారు భవిష్యత్తు: మంత్రి సీతక్క






**ములుగు జిల్లా, ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** అంగన్వాడి కేంద్రాలలో చిన్నారుల బంగారు భవిష్యత్తుకు ప్రజా ప్రభుత్వం బాటలు వేస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. గురువారం గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని లక్నవరం క్రాస్ వద్ద ఉన్నా కిచెన్ షెడ్ లో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ అనిత రామచంద్రన్, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ లతో కలిసి అంగన్వాడి టీచర్లకు 5జి స్మార్ట్ ఫోన్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మెరుగుపరచడానికి, డిజిటలైజేషన్ ప్రక్రియను సులభతరం చేయడానికి ప్రభుత్వం నూతన స్మార్ట్ ఫోన్లను అందిస్తుందని స్పష్టం చేశారు. నూతన స్మార్ట్ ఫోన్ ద్వారా అంగన్వాడి టీచర్లు గర్భిణీలు, బాలింతలు, 0–6 సంవత్సరాల పిల్లల వివరాలను నమోదు చేసి వారి వివరాలను డిజిటల్ రికార్డులో భద్రపరచడం జరుగుతుందని, అంగన్వాడి కేంద్రానికి వచ్చే పిల్లలు మహిళలు రోజువారి హాజరు నమోదు చేయాలని, పిల్లల ఎత్తు, బరువు, పోషక ఆహారం పంపిణీ వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి డేటా అందించాలని అన్నారు. వీటి ద్వారా అంగన్వాడీ కేంద్రంలో పనితీరు ఒకే చోట నుంచి మానిటరింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్న 5జి స్మార్ట్ ఫోన్ లను వినియోగిస్తూ ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు అంగన్వాడి కేంద్రాల పనితీరును పిల్లలు, గర్భిణి స్త్రీలు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాలు అందించే పౌష్టిక ఆహార వివరాలను ప్రభుత్వానికి నివేదికలను పంపించాలని అంగన్వాడీ టీచర్లకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అంగన్వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతుందని గ్రామాలలో ఉండే పిల్లలను అంగన్వాడి కేంద్రాలలో చేరే విధంగా చూడాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించి వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన అవసరం లేదని,అంగన్‌వాడీ కేంద్రాలు సౌకర్యాల వసతులతో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తూ ప్రీ ప్రైమరీ ఇంగ్లీష్ మీడియం విద్యను కూడా ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 545 టీచర్లకు 5+ స్మార్ట్ ఫోన్ లను అందించడం జరిగిందని,పోర్షన్ ట్రాకర్,ఎన్ హెచ్ టి ఎస్ మొబైల్ అప్లికేషన్లను 5జి స్మార్ట్ ఫోన్ల ద్వారా సులభతరం ఉపయోగించవచ్చని అన్నారు. అంగన్వాడి టీచర్లు సమయపాలన పాటిస్తూ పౌష్టిక ఆహారం అందించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని విధినిర్వహణలో సమస్యలు తలెత్తితే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ అక్కేశ్వర్ రావు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ, స్థానిక సర్పంచ్ మేకల రాధా, డి డబ్ల్యు ఓ ప్రేమలత, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

## ఖమ్మంలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి విప్లవ వీరుడికి నివాళులర్పించిన డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్

**ఖమ్మం, ప్రతినిధి మార్చి 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని పురస్కరించుకొని ఖమ్మం నగరంలోని ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలదండలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్డీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఘనంగా సాగింది. ఈ కార్యక్రమానికి టీఎంహెచ్డీ రాష్ట్ర అధ్యక్షులు, దళితరత్న డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అనగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహావీరుడని, తెలంగాణలో తొలి బహుజన రాజ్య స్థాపకుడిగా చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. మొగల్ పాలకుల గుండెల్లో సింహస్వప్నంగా నిలిచిన మహానాయకుడైన పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన త్యాగాలు ఎప్పటికీ స్మరణీయమని పేర్కొంటూ, ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కుక్కల రామకృష్ణ, ఆర్కే, పగిడి ముక్కుల విజయ్ కుమార్, కాంపాటి ఉపేందర్, సతీష్, మధు తదితరులు పాల్గొని పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



# ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో ప్రభుత్వ అభివృద్ధి పై అవగాహనతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారం

### అభివృద్ధిలో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలి

### అన్ని రంగాలలో మహిళలకు పెద్దపీట

### ప్రతి మహిళను మహిళా సంఘాలలో చేర్పించాలి: మంత్రి సీతక్క





**ములుగు జిల్లా,ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామాల అభివృద్ధిలో గ్రామంలోని ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని, ప్రతి మహిళను మహిళా సంఘాలలో చేర్పించడానికి కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కఅన్నారు. గురువారం ములుగు మున్సిపాలిటీలోని ఆరవ వార్డు లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మున్సిపల్ చైర్మన్ చింత నిప్పుల చంద్రకళ బిక్షపతి అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొని మాట్లాడుతూ మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో 99 రోజుల ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక సందర్భంగా గత రెండు సంవత్సరాలలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్దిని ప్రజలకు వివరిస్తూ ప్రజల సమస్యలను తీర్చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని తెలిపారు.నూతనంగా ఏర్పడిన ములుగు మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడానికి కోటి 25 లక్షల రూపాయలతో ప్రత్యేక వాహనాలను కొనుగోలు చేయడమే కాకుండా 50 కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులను ఈనెల 15 నుండి ప్రారంభించడం జరుగుతుందని వివరించారు. పారిశుద్ధ్య కార్మికులు నిత్యం పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టడం హర్షించదగ్గ విషయమని, వారి వేతనాల పెంపు కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకోబోతున్నదని తెలిపారు. అన్ని రంగాలలో మహిళలు ప్రాతినిధ్యం వహించేందుకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తున్నామని, జిల్లా వ్యాప్తంగా మహిళా సంఘాల వారికి 57 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందించడం జరిగిందని, మరో 43 వేల కోట్ల రూపాయల రుణాలను అందించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు, పలు రకాల పెన్షన్లు పొందని నిరుపేదలు దరఖాస్తు చేసుకోవాలని, ప్రతి కుటుంబంలోని మహిళ సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని అన్నారు. మహిళా సంఘాల సభ్యురాలకు వైద్య పరీక్షలు నిర్వహించడం కోసం ఒక్కొక్క మహిళకు 5 వేల నుండి పదివేల రూపాయల విలువ గల వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ప్రతి సంఘ సభ్యురాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సంఘంలోని సభ్యురాలు రుణాలు పొంది మరణించిన పక్షంలో రెండు లక్షల రూపాయల రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తున్నదని, ఇప్పటివరకు 41 కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేయడం జరిగిందని వివరించారు. బ్యాంకు తరహాలోనే స్త్రీ నిధి, సర్ఫ్ సంస్థలు పనిచేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా గ్రంధాలయం చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో యువకుడి ఆకస్మిక మృతి

- కుటుంబంలో విషాదం



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం నగరంలో విషాదం చోటుచేసుకుంది. నగరం లోని 60వ డివిజన్ రామన్నపేటకు చెందిన బండారు శోభనబాబు (38) గురువారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో మలవిసర్జన కోసం వెళ్లిన శోభనబాబు చాలా సేపటికీ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. పలుమార్లు పిలిచినా స్పందన లేకపోవడంతో తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లగా, ఆయన అపస్మారక స్థితిలో కనిపించారు. తక్షణమే సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినప్పటికీ, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఆకస్మిక ఘటనతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.మృతుడు శోభనబాబుకు భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబానికి అండగా ఉన్న ఆయన ఇలా అకస్మాత్తుగా దూరమవ్వడం స్థానికులను కలచివేసింది. రామన్నపేట ప్రాంతంలో ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.

# ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం పెద్ద ముప్పారం గ్రామ సభలో ప్రభుత్వ విప్ డా. జాటోత్ రామచంద్ర నాయక్

**దంతాలపల్లి, ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** దంతాలపల్లి మండలం పెద్ద ముప్పారం గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి కార్యక్రమం గ్రామస్థుల విశేష స్పందన మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ ముఖ్య అతిథిగా హాజరై గ్రామ ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను స్వయంగా వినిపించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు తక్షణ పరిష్కారం అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి వెనుకడుగు ఉండదని హెచ్చరించారు.గ్రామాభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగాలని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా చూడాలని అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో, ఎమ్మార్వో సునీల్ కుమార్ రెడ్డి, దంతాలపల్లి మండల అధ్యక్షులు, తొర్రూర్ మార్కెట్ వైస్ చైర్మన్ బట్టు నాయక్, గ్రామ సర్పంచ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు మరియు గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




# ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే గుణానికి ఆంజనేయుడే నిదర్శనం: బొల్లెపల్లి లక్ష్మణ్ రాజు

### - ఘనంగా శ్రీ హనుమాన్ విజయోత్సవ జయంతి



**అంబర్ పేట ఏప్రిల్ 02(పిసిడబ్ల్యూ న్యూస్):**పటేల్ నగర్ డివిజన్లో శ్రీ మహాలక్ష్మి కాలనీ లో బజరంగ్ దళ్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ హనుమాన్ విజయోత్సవ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బజరంగ్ దళ్ సేవాసమితి అధ్యక్షులు బొల్లెపల్లి లక్ష్మణ్ రాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం హనుమాన్ విజయోత్స జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని ఈ సంవత్సరం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశామని శ్రీరాముడికి నమ్మిన బంటు హనుమంతుడని ఆ స్వామివారి కృప అందరి పై ఉండాలని అందరిని ఆయురారోగ్యాలతో చల్లగా కాపాడాలని , ఎంత ఎదిగిన ఒదిగి ఉండాలనే గుణానికి ఆంజనేయుడే నిదర్శనమని అందరూ భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి జరుపుకోవాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో శేఖర్ గౌడ్, బొల్లెపల్లి రాఘవేందర్ రాజు, వంజరి నరేష్, వంజరి రాజశేఖర్, శేఖర్ చారి, శివకుమార్, నాగరాజుగౌడ్, ఓంకారం అయోధ్య రాజు, విజయ్ కుమార్, కన్నా, నరేష్, శ్రీకాంత్ గౌడ్, ప్రదీప్ ముదిరాజ్, సాయికుమార్ చారి, భాను, ప్రసాద్, నందు, లడ్డు, గౌతమ్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

### గ్రామ సభల ద్వారా అభివృద్ధి ప్రణాళికలు

### నారాయణపురం, వి.ఎం. బంజర గ్రామాల్లో పాల్గొన్న సబ్ కలెక్టర్





**కల్లూరు, ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం భాగంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కల్లూరు మండలంలోని నారాయణపురం గ్రామం, పెనుబల్లి మండలంలోని వి.ఎం. బంజర గ్రామాలలో నిర్వహించిన గ్రామ సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల లబ్ధి చేరేలా అధికారులు కట్టుదిట్టంగా పనిచేయాలని ఆయన సూచించారు. గ్రామస్థులు కూడా పథకాలపై అవగాహన పెంచుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అందాల్సిన సేవలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు.అదేవిధంగా గ్రామ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని, ప్రజల నుండి వచ్చే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పారదర్శకంగా పాలన కొనసాగించడం ద్వారా ప్రజల విశ్వాసం పొందవచ్చని ఆయన తెలిపారు. గ్రామ సభలు ప్రజల అభిప్రాయాలను నేరుగా తెలుసుకునే వేదికలుగా నిలుస్తాయని, వాటి ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి గ్రామం సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు అధికారులు, ప్రజలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారి వర్ధంతి

### వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సమాచార పౌరసంబంధాల శాఖ, కొమురయ్య



**ములుగు జిల్లా ,ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ములుగు జిల్లా సంక్షేమ భవనంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారి వర్ధంతిని పురస్కరించుకుని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ములుగు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి డా. కె. కొమురయ్య గారి ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి గారు మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారు అతి సాధారణ కుటుంబంలో జన్మించి, తన ధైర్యసాహసాలతో చిన్న మిత్రగణంతోనే మొఘల్ సామ్రాజ్యాన్ని సవాలు చేసి, గోల్కొండ కోటపై బహుజన జెండాను ఎగరవేసి సుమారు 7 నెలలు పాలించిన తొలి బహుజన నాయకుడని కొనియాడారు.అలాగే ఆయన సుమారు 30 సంవత్సరాల పాటు స్వంత రాజ్యాన్ని పాలించిన తెలంగాణ బహుజన ముద్దుబిడ్డగా చరిత్రలో నిలిచారని ప్రశంసించారు ఇంకను పాల్గొని ప్రసంగించిన వారు ములుగు పులి నర్సింగం గౌడ్, జిల్లా జీూజ అధ్యక్షులు ముంజాల బిక్షపతి గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, మరియు సంక్షేమ భవన కార్యాలయ సిబ్బంది. బిసి వెల్ఫేర్ శాఖా ఉద్యోగులు సరిత, మానస, రేణుక, సాదాలు, జి.గోపాల్ చారి, రత్నాకర్ నాలుగవ తరగతుల ఉద్యోగులు, విలేకరులు పాల్గొన్నారు.

# శివాయిగూడెంలో ఘనంగా గ్రామసభ గ్రామాభివృద్ధికి కీలక నిర్ణయాలు




**రఘునాథపాలెం, ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్):**శివాయిగూడెం గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామసభ సమావేశం గ్రామ సర్పంచ్ సునీత అధ్యక్షతన ఘనంగా నిర్వహించబడింది. గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో హాజరై గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు.గ్రామంలోని మౌలిక వసతుల అభివృద్ధిని వేగవంతం చేయడం, స్మశాన వాటికకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడం, ఎండాకాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడం వంటి అంశాలను సమావేశంలో ప్రాధాన్యతగా చర్చించారు. ప్రజలకు అవసరమైన సేవలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా వితంతు, వృద్ధాప్య మరియు అంగవైకల్యం కలిగిన వారికి ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ పథకాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే భవిష్యత్‌లో విద్యుత్ ఖర్చులను తగ్గించేందుకు సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరాన్ని నాయకులు వివరించారు.గ్రామ ప్రజల సంక్షేమం కోసం అమలులో ఉన్న పలు ప్రభుత్వ పథకాల గురించి సమావేశంలో వివరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా సమిష్టిగా పనిచేయాలని తీర్మానించారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజలుప్రజాప్రతినిధులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉప సర్పంచ్ శారద , వార్డు సభ్యులు సైదా నాయక్, లాల్ సింగ్ నాయక్, హరి నాయక్, సరోజ గారు, గ్రామ పెద్దలు ప్రదీప్ కుమార్, నందా, లాలు, తావు, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ పార్టీలో అసంతృప్తి జ్వాలలు

**కష్టపడ్డ వారిని కాదని కొత్త వారికి ఛాన్స్?**

**పారాషూట్ నాయకులకు చెక్ పెట్టాలి,**

**నిజమైన కార్యకర్తలను గుర్తించండి**

**జెండా మోయనివారికి పదవులెలా ఇస్తారు.**

**వెంకట్ రెడ్డి నగర్‌లో బీజేపీ అంతర్గత కలకలం..**

**పార్టీ జెండా మోసే కార్యకర్తలకు పార్టీ పదవి ఇవ్వండి**

**క్రమశిక్షణ గల కార్యకర్తలకు బాధ్యత అప్పగించండి**

**పార్టీకి కష్టం చేసిన వారికే**

**గౌరవం ఇవ్వాలి... కార్యకర్తల హెచ్చరిక**

**ఉప్పల్ ఏప్రిల్ 02 (పిసిడబ్ల్యూ న్యూస్):**గ్రేటర్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో కొత్తగా ఏర్పడిన వెంకట్ రెడ్డి నగర్ డివిజన్‌లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్ష ఎన్నికలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రానున్న గ్రేటర్ ఎన్నికల దృష్ట్యా ఈ పదవికి ప్రాధాన్యం పెరగడంతో, పార్టీలో అంతర్గతంగా తీవ్ర పోటీ నెలకొంది. పార్టీకి అంకితభావంతో పని చేసిన క్రమశిక్షణ గల కార్యకర్తలకు కాకుండా, ఇటీవలే పార్టీలో చేరిన నాయకులకు లేదా ఒక వ్యక్తి ఆధారంగా రాజకీయాలు చేసే వారికి అధ్యక్ష పదవి ఇవ్వాలని ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీ జెండా మోయని పారాషూట్ నాయకులకు పదవులు ఇవ్వడం ఎంతవరకు సమంజసం? అని సీనియర్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో హబ్సిగూడ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థి విజయంలో కీలక పాత్ర పోషించిన నాయకులను పక్కనపెట్టి, పార్టీ సిద్ధాంతాలు సరిగా తెలియని కొత్త నాయకులు అధ్యక్ష పోటీలో ఉండడం కార్యకర్తల్లో అసంతృప్తిని పెంచుతోంది. పార్టీలో ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్న వారికి అవకాశాలు ఇవ్వకపోవడం వల్ల వారి మనోభావాలు దెబ్బతింటాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ అభ్యర్థి ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్‌కు వ్యతిరేకంగా ఇతర పార్టీలకు మద్దతు ఇచ్చిన నాయకులు కూడా ఇప్పుడు పార్టీ పదవుల కోసం ప్రయత్నించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఒక పార్టీలో ఉంటూ మరో పార్టీకీ వత్తాసు పలికే నాయకులను ప్రోత్సహిస్తే పార్టీ బలహీనపడుతుంది అని కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు. యువతకు అవకాశాలు కల్పించాలన్న డిమాండ్ కూడా బలంగా వినిపిస్తోంది. రానున్న గ్రేటర్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజల్లో పనిచేసే యువ నాయకత్వాన్ని ముందుకు తీసుకురావాలని, ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేసే వారికే బాధ్యతలు అప్పగించాలని పార్టీ వర్గాలు కోరుతున్నాయి. డబ్బులు ఉన్న నాయకుడికి ఒక లెక్క, డబ్బులేని నాయకుడికి మరో లెక్క అనే విధానం ఉండకూడదు. బీజేపీ సిద్ధాంతం కష్టం చేసిన వారిని గౌరవించడం అని కార్యకర్తలు స్పష్టం చేస్తున్నారు. ఆర్థిక స్థోమత ఆధారంగా కాకుండా, పార్టీకి చేసిన సేవలు, నిబద్ధత ఆధారంగా పదవులు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మొత్తానికి వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్ష ఎన్నికలు కేవలం ఒక పదవి కోసం పోటీ కాకుండా, పార్టీ విలువలు, క్రమశిక్షణ, మరియు కార్యకర్తల గౌరవానికి సంబంధించిన పరీక్షగా మారాయి. అధిష్ఠానం ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని, పార్టీకి నిస్వార్థంగా సేవ చేసిన నాయకుడిని ఎంపిక చేస్తుందా లేదా అన్నది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. పదవులు ఉన్నా లేకున్నా పార్టీని నమ్ముకుని పార్టీ పిలుపుమేరకు ప్రతి కార్యక్రమంలో పాల్గొంటున్న నాయకులను గుర్తించి పదవిని అప్పజెప్పాలని బిజెపి నాయకులు అధిష్టానాన్ని కోరుచున్నారు.

## విద్యపై వివక్ష: బిఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్ర బడ్జెట్ 2026--27లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి బిఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కాలేజీల్లో, యూనివర్సిటీల్లో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. కొఠారి కమిషన్ నివేదిక ప్రకారం విద్యపై 30శాతం బడ్జెట్ కేటాయించాల్సి ఉండగా మొక్కుబడిగా కేవలం 8.22 శాతం మాత్రమే కేటాయించి చేతులు జరుపుకున్నారు. తక్షణమే బడ్జెట్ ను సవరించి విద్యారంగానికి 30 శాతం బడ్జెట్ కేటాయించాలన్నారు. బకాయిలుగా ఉన్న 9,500 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకుండా, స్కాలర్షిప్ లకు నిధులు మంజూరు చేయకుండా కొత్తగా అంతర్జాతీయ స్థాయి అంటూ అంకెల గారడి చేస్తున్నారని విమర్శించారు. బడ్జెట్లో విద్యారంగానికి జరిగిన కేటాయింపులు చూస్తే ప్రభుత్వానికి విద్యారంగంపై ఎంతటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా ఈ బడ్జెట్ ఉందని బొడ్డు బాబురావు దుయ్యబట్టారు.

# ప్రజా సమస్యలకు వేదికగా వార్డు సభ

**- ఖమ్మం 48వ డివిజన్‌లో ప్రజాపాలనకు నూతన ఊపు**

**సంక్షేమ పథకాలపై అవగాహన, లబ్ధిదారులతో ప్రత్యక్ష సంభాషణ**

**అభివృద్ధి పనుల్లో ఆలస్యం అధికారులపై ప్రజల ఆవేదన వెల్లడి**



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 48వ డివిజన్‌లో "ప్రజా పాలన – పట్టణ ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వార్డు సభ ప్రజల సమస్యలకు అద్దం పట్టింది. స్థానిక ఎంబి గార్డెన్‌లో గురువారం జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన లబ్ధిదారులతో అధికారులు ప్రత్యక్షంగా మట్లాడటం విశేషం. పరిపాలన అధికారి రజిని, వార్డు ఆఫీసర్ ఉమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథిగా డివిజన్ కార్పొరేటర్ తోట గోవిందమ్మ రామారావు, మాజీ కార్పొరేటర్ తోట రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమ డివిజన్ ప్రజలకు అందాల్సిన పలు సంక్షేమ పథకాలు ఇంకా పూర్తిస్థాయిలో చేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, వితంతు, వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్లు, రూ.500 గ్యాస్ రాయితీ, రేషన్ కార్డులు వంటి కీలక పథకాలు అర్హులైన పేదలకు అందకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ విషయమై ప్రజలు పలుమార్లు అధికారులను ఆశ్రయించినప్పటికీ సరైన స్పందన లేకపోవడం దురదృష్టకరమని తెలిపారు. డివిజన్‌లో అభివృద్ధి పనులు కూడా నిధుల లేమితో నిలిచిపోయాయని, ఈ సమస్యలపై మంత్రివర్యులు, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుని గుర్తించి సంక్షేమ పథకాలు అందించేందుకు సమగ్ర పరిశీలన అవసరమని ఆమె స్పష్టం చేశారు. ప్రజల ఆశలు, ఆవేదనలు ఒకే వేదికపై వ్యక్తమవడంతో ఈ సభకు ప్రత్యేక ప్రాముఖ్యత ఏర్పడింది. ఈ వార్డు సభలో డివిజన్ నాయకులు వంగాల వెంకట్, చేతి కృష్ణ, బాబా, కిషన్ నాయక్, మోటే కుమార్ శివ, రెడ్డి తదితరులు పాల్గొని ప్రజల సమస్యలను ప్రస్తావించారు.

## హనుమాన్ విజయోత్సవ ర్యాలీ



**ములుగు,ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హనుమాన్ విజయోత్సవ వేడుకలను పురస్కరించుకుని ములుగు జిల్లా బండారుపల్లి గ్రామంలో హనుమాన్ భారీ ర్యాలీని అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. సంబంధించిన కొన్ని ముఖ్య విశేషాలుపాల్గొన్న ప్రముఖులు: ఈ ర్యాలీలో చంద్రగిరి బిక్షపతి, కొండి సాంబశివతో పాటు బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం, జిల్లా మరియు మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులు బజరంగ్ దళ్ సభ్యులు పెద్ద సంఖ్యలో హనుమాన్ భక్తులు ఈ శోభాయాత్రలో పాల్గొని జై శ్రీరామ్ నినాదాలతో గ్రామాన్ని భక్తిశ్రద్ధలతో నింపేశారు. ర్యాలీ ఉద్దేశం ధర్మ ప్రచారం మరియు హిందూ ఐక్యతను చాటిచెప్పేలా ఈ విజయోత్సవ ర్యాలీ సాగింది.

# ప్రజల సమస్యలకే ప్రాధాన్యం

**48వ డివిజన్ వార్డు సభలో హృదయ స్పందన**

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై అవగాహన, సంక్షేమ పథకాలపై చర్చ**

**మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆశీస్సులతో**

**భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు**

**అభివృద్ధి దిశగా కాంగ్రెస్ ముందడుగు భవిష్యత్‌కు హామీలు**

**కాంగ్రెస్ పార్టీ నగర కార్యవర్గ సభ్యులు అల్లె సాయికిరణ్**

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా 48వ డివిజన్‌లో నిర్వహించిన వార్డు సభ ప్రజల ఆశలు, అవసరాలకు ప్రతిబింబంగా నిలిచింది. మేకల బిక్షమయ్య ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన ఈ సమావేశంలో స్థానిక ప్రజలు, నాయకులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నగర కార్యవర్గ సభ్యులు అల్లె సాయికిరణ్ మాట్లాడుతూ... ఈ గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్యాస్ సబ్సిడీలు, పింఛన్లు నిజంగా అర్హులైన వారికి అందుతున్నాయా లేదా అనే అంశాలపై చర్చించడం జరిగిందని తెలిపారు. ప్రజల అవసరాలు, సమస్యలు తెలుసుకుని వాటికి పరిష్కార మార్గాలు కనుగొనడం ఈ సభల ప్రధాన లక్ష్యమని వివరించారు. అదేవిధంగా 48వ డివిజన్‌లో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, ఇంకా కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆశీస్సులతో భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి డివిజన్‌ను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ అధ్యక్షులు బోజట్ల సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్




సింగం అంజయ్య, ఎస్కే జహీర్, శివ, గొడుగు మలుసూరు, మిచ్చిన్ రామకృష్ణ, షాముద్దీన్, యాకూబ్ పాషా, సారంగపాణి, వంశీతో పాటు మున్సిపాలిటీ జూనియర్ అసిస్టెంట్ స్పెషల్ ఆఫీసర్ రజిని, వార్డ్ ఆఫీసర్ ఉమేష్, జవాన్ బంగారి, మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు. సభలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల గొంతుకను వినిపించే వేదికగా ఈ వార్డు సభ నిలవడం స్థానికంగా సానుకూల స్పందనను రేకెత్తించింది.

## సేవే లక్ష్యం... బాధ్యతే ధర్మం

**- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రుద్ర ప్రదీప్ నియామకం**



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో మరో యువ నాయకుడికి కీలక బాధ్యతలు అప్పగించబడ్డాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆదేశాల మేరకు రుద్ర ప్రదీప్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈ నియామకం పార్టీ వర్గాల్లో ఆనందాన్ని కలిగించడంతో పాటు, ఆయనపై ఉన్న నమ్మకాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. ఈ సందర్భంగా రుద్ర ప్రదీప్ స్పందిస్తూ, తనకు ఈ కీలక బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు, జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి కు, జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావుకు, అలాగే రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "నాపై విశ్వాసం ఉంచి ఇచ్చిన ఈ బాధ్యతను నేను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తాను. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా, ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తాను" అని ఆయన పేర్కొన్నారు. రుద్ర ప్రదీప్ తన రాజకీయ ప్రస్థానంలో సాధారణ కార్యకర్తగా ప్రారంభమై, క్రమంగా పార్టీకి అంకితభావంతో పనిచేస్తూ నాయకత్వ స్థాయికి ఎదిగిన వ్యక్తిగా పేరుపొందారు. ప్రజలతో మమేకమవుతూ, వారి సమస్యల పట్ల స్పందించే స్వభావం ఆయనకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చింది. భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని, యువతను పార్టీ వైపు ఆకర్షించేలా కార్యాచరణ రూపొందిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఆయన నియామకంతో జిల్లా స్థాయిలో పార్టీ కార్యకలాపాలకు మరింత ఊపు వస్తుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# రైతుల ఆవేదనకు స్వరం







**మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల కోసం నిరసన**

**మార్క్‌ఫెడ్ కేంద్రాలు ఆలస్యం రైతులకు భారీ నష్టం**

**కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్**

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రైతుల కష్టానికి సరైన విలువ దక్కాలనే ఆకాంక్షతో గణేశ్వరం గ్రామంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని రైతులు కల్లాల వద్ద సీపీఐ(ఎం) నాయకులు గళమెత్తారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ మాట్లాడుతూ, ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు చేస్తామని ప్రకటించి ఇప్పటికే 15 రోజులు గడిచినా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం రైతుల పట్ల నిర్లక్ష్యంగా ఉందని విమర్శించారు. గ్రామ స్థాయిలో కేంద్రాలు లేకపోవడంతో రైతులు తమ పంటను ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వస్తోందని, దీనివల్ల ప్రతి క్వింటాల్‌కు రూ.700800 వరకు నష్టం చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో సుమారు 13,000 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిన నేపథ్యంలో, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఆలస్యమైతే రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతు కష్టానికి న్యాయం చేయాలంటే వెంటనే గణేశ్వరం గ్రామంతో పాటు రఘునాథపాలెం మండలవ్యాప్తంగా మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కనీస మద్దతు ధరకు పంట కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించకపోతే, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.ఏ. జబ్బార్, మండల కార్యదర్శి ఎస్. నవీన్ రెడ్డి, మండల కమిటీ సభ్యులు కూచిపూడి నరేష్, వల్లూరి శ్రీనివాస్ రావు, కన్నెగంటి తిరపయ్య, గుగులోతు కుమార్, కొమ్ము రాంబాబు, నల్లమోతు నాగయ్య, బి. లక్ష్మణ్, కె. వెంకన్న తదితర సీపీఐ(ఎం) నాయకులు, రైతులు పాల్గొని తమ సమస్యలను వ్యక్తం చేశారు.